**కథ**

# ఏ 'కాంత' సేవ

- జంధ్యం వెంకటేష్ బాబు

**ఒకే ఆవరణలో రెండుపోర్షన్‌లుండి, ఆ రెండో పోర్షన్‌లో పెళ్ళికాని ప్రౌఢ ఉంటే కలిగే ఆనందం ఏమిటో తొలిసారి అనుభవంలోనికి వచ్చింది గోపాలకృష్ణకు.**

**కొత్తగా ఆ ఇంట్లో అద్దెకు దిగాడు అతడు. ప్రస్తుతం పెళ్ళయిన వంటరివాడు. ఏ 'కాంత' తోడులేక, వయసు చేతిలో చిక్కి విలవిలలాడుతున్న దీనుడు.**

**గోపాలకృష్ణ భార్య 'అరుణ'కు పుట్టింటి మీద ధ్యాస ఎక్కువ.**

ఆరు నెలలకొకసారి హైదరాబాదు నుండి కాకినాడ చేరుకుని అక్కడే ఓ మూడు నాలుగు నెలలు ఉండిపోతుంది. పుట్టింటిలో ఉండిపోవడానికి ఆమె ఏవేవో కారణాలు కల్పించి చెపుతుందీ, లేని అనారోగ్యం వచ్చినట్టుగా తెలియచేస్తుంది. ఆమెకు భర్త 'ఆకలి' గురించి కూడా ఏమాత్రమూ పట్టదు.

భార్య పుట్టింటికి వెళ్ళి రెండు నెలలయ్యాక, అప్పటివరకూ ఉన్న ఇల్లు హఠాత్తుగా ఖాళీ చేయవలసి వచ్చింది. అదృష్టవశాత్తు వెంటనే ఆ ఇల్లు దొరకడంతో అందులో దిగిపోయాడు గోపాలకృష్ణ.

ఆ ఆవరణలోనే పక్క పోర్షన్‌లో ఉన్న విమలకుమారిని చూడడంతోనే అతడికి తాను చదువుకున్న కావ్యాల్లోని చాలా పదాలు గుర్తుకు వచ్చాయి. 'పీస పయోధర..గగనజఘన..మనోజ్ఞరూప..మదనప్రకోప....' మనసు ఎక్కడెక్కడో విహరించడం మొదలుపెట్టింది. 'పీస పయోధర మర్దన చంచల కరయుగశాలీ!' అతడు తన చేతుల కేసి చూసుకున్నాడు. 'అంత అదృష్టం తన చేతులకు దక్కితే బాగుండును కదా' అనుకున్నాడు.

ఆమెతో ఎలా మాట్లాడాలి?..మాటలతో పరిచయం, తరచుకలవడంతో స్నేహం, ఆ తర్వాత ప్రణయం..

ఊహలలో విహరించడమే తప్ప, ఆ ఇంట్లో దిగిన రెండు రోజుల వరకూ కూడా అతడు ఆమెను పలకరించే ప్రయత్నం చేయలేకపోయాడు. ఊహలలో విహరించినంత సులభం కాదు. ఓ ఆడదాన్ని మగవాడు పలుకరించి, పరిచయం చేసుకోవడం. మూడోరోజు మాత్రం ఆమె మార్కెట్ నుంచి కాబోలు ఇంటికొస్తుంటే వాకిట ఎదురుపడి పలకరింపుగా నవ్వాడు. ఆమె కూడా ఓ నవ్వు వదిలి ముందు కెళ్ళింది. అతడు 'హమ్మయ్య' అనుకున్నాడు. ప్రక్కపోర్షన్‌లో ఉన్న తనను ఆమె కనీసం గుర్తుపట్టిందన్న సంతృప్తి అది.

అయితే నాలుగోరోజు అనుకోని అద్భుతం జరిగింది.

గోపాలకృష్ణ కాలేజీ నుండి తిరిగొస్తూ ఉన్నాడు. కాలేజీగేటు దాటుతూ యధాలాపంగా ఆకాశం కేసి చూసాడు. నల్లని మబ్బులు హడావుడిగా అటునిటు పరుగెడుతున్నాయి. ఏ నిముషానయినా వర్షం పడేలా ఉంది. అతడు స్కూటర్‌ని వేగంగా ముందుకు పోనిచ్చాడు. త్వరగా ఇంటికి చేరుకోవాలి. లేకుంటే వర్షంలో తడిసిపోయే అవకాశం ఉంది.'

సెంటర్‌కి చేరుకున్నాడు. ప్రతిరోజూ సాయంత్రం ఆ సెంటర్‌లోని కేఫ్‌లో ఛాయ్ తాగుతూ ఓ అర్ధగంట గడపటం అతడికి అలవాటు. కాని. ఈరోజు వర్షం వచ్చేలా ఉంది. ఛాయ్ కోసం ఆగిపోయి, తడిసి ఇంటికి చేరుకోవడం అతడికిష్టంలేదు. అందుకే అతడు సెంటర్‌లో ఆగకుండా మెయిన్‌రోడ్‌లో ముందుకు పోసాగాడు.

స్కూటర్ గాంధీనగర్ బస్టాప్ సమీపించాక, అతడు అటుకేసి చూసాడు. గుండె ఒక్కసారిగా ఆగి కొట్టుకోవడం మొదలుపెట్టింది. అతడు అసలక్కడ ఆమెను ఊహించలేదు. బస్టాప్‌లో విమలకుమారి....

అప్పటికే స్కూటర్ పది అడుగులు ముందుకెళ్ళిపోయింది. అతడు అప్రయత్నంగానే బండి స్లో చేసాడు. క్షణంలోనే మనసు పరిపరివిధాలా ఆలోచించింది. రెండోక్షణంలో అతడో నిర్ణయానికి రాగలిగాడు.

అతడు స్కూటర్‌ని వెనక్కుతిప్పి ఆమె ముందు ఆపాడు. ''నమస్తే మేడమ్''.

ఎటో చూస్తున్న ఆమె ఉలిక్కిపడి, తలతిప్పి అతడికేసి చూసింది. అతడిని గుర్తుపట్టి పలకరింపుగా నవ్వింది.

అతడు చెప్పాడు. ''వర్షం వచ్చేలా ఉంది. బస్సుకోసం వెయిట్ చేస్తూ ఉంటే తడిసిపోతారేమో! ఇక్కడ కనీసం షెల్టర్ కూడా లేదు.'' అతడు తన స్కూటర్ ఎక్కమని డైరెక్ట్‌గా చెప్పలేదు. ఆమెకు మాత్రం అర్థమయింది.

కొద్దిక్షణాలు తటపటాయించింది. ఆ తర్వాత ఆకాశం చేసి చూసింది. తలదించిరోడ్డు చివర వరకూ దృష్టిసారించింది. బస్సు వచ్చే జాడ లేదు. ఆమె ఒక్క నిర్ణయానికి వచ్చినట్టు చిన్నగా నిట్టూర్చి, ''పదండి'' అంది. ఆమె స్కూటర్ ఎక్కాక 'పట్టు'కోసం అతడి భుజం మీద చెయ్యి వేసింది.

గోపాలకృష్ణ జీవితం మొత్తంలో థ్రిల్ ఫీలయిన క్షణాలు అతికొద్ది మాత్రమే. అప్పుడెప్పుడో జాబ్‌కి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నప్పుడు, ఆ తర్వాత అరుణతో శోభనం రాత్రి గడియలు, మళ్ళీ ఇప్పుడు ఇదిగో ఓ పరాయి స్త్రీ, అందులోనూ తన ఊహల్లో ఆడది తన భుజం మీద చెయ్యివేస్తే-ఈ థ్రిల్ అంతకుముందు అనుభవించిన థ్రిల్స్ అన్నింటినీ డామినేట్ చేసింది.

అతడు స్కూటర్‌ని ముందుకు పోనించాడు. అయితే అతడికి స్కూటర్ రోడ్డుమీద పోతున్నట్టుగా అనిపించటం లేదు. ఆకాశమార్గాన పయనిస్తున్నట్టుగా ఉంది. ఆ మార్గంలో మరెవ్వరూ లేరు. తను, విమలకుమారి మాత్రమే! ఆమె చెయ్యి తన భుజం మీద నుండి జారి నడుము చుట్టూ చేరింది. నడుమును పట్టిన చెయ్యి ఆ చోట ఊరకుండిపోలేదు. షర్ట్ బటన్స్ విప్పుతోందా చెయ్యి. తను మాత్రం స్కూటర్‌ని డ్రైవ్ చేస్తూనే ఉన్నాడు. షర్ట్ ఎప్పుడో గాల్లోకి ఎగిరిపోయింది. ఇప్పుడు ఆమె రెండు చేతులు తన శరీరం మీద మరో అచ్ఛాదనను తొలగించే ప్రయత్నం చేస్తున్నాయి. ఆ ప్రయత్నంలో ఆమె సఫలమయింది. అతడు మాత్రం నగ్నంగా తయారయ్యాడు. ఆమె రెండు చేతులూ అతడి నగ్న శరీరంమీద తమకంగా కదులుతున్నాయి. స్కూటర్ ఆకాశమార్గం నుండి స్వర్గంవైపు వెళ్ళిపోతూ ఉంది.

'రెడ్‌లైట్ ఆన్ అయినప్పటికీ దూసుకొచ్చేసావ్' అని ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డంపడి ఆపి ఉండకపోతే! అతడు నిజంగానే స్వర్గం చేరుకుని ఉండేవాడు- యాక్సిడెంట్ చేసి!

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కి ఫైన్ కట్టి, ముందుకు సాగిపోతుంటే వెనుక నుండి విమలకుమారి నవ్వుతూ అడిగింది ''ఇంతకీ మీరు యూనివర్సిటీ ప్రొఫెసరా?''

''కాదండీ'' అని ఆగాక, క్షణం తర్వాత అడిగాడు.

''ఎందుకడిగారలా?''

''సిటీ రోడ్ల మీద డ్రైవ్ చేసేటప్పుడు చాలా కాన్షియస్‌గా ఉండాలి. అలాంటిది ఆబ్సెంట్‌మైండ్ ప్రొఫెసర్‌లా పరధ్యాన్సగా డ్రైవ్ చేస్తుంటేనూ?''

'అసలు విషయం చెపితే ఏం జరుగుతుందో' అతడికి తెలుసు. అందుకే ఇబ్బందిగా నవ్వాడు.''నేను కాలేజీలో తెలుగు లెక్చరర్‌ని''

''మీరూ లెక్చరేనా? బాగుంది''. ఆమె గొంతులో కొంతమార్పు. ''నేను ఏ.వి.కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌ని''వెంటనే చెప్పిందామె.

ఆమె ఎక్కడో జాబ్ చేస్తుందని తెలుసు. ఇంగ్లీషు లెక్చరర్ అని మాత్రం తనకు తెలియదు. ఆమె ఇంగ్లీషు లెక్చరర్ అని తెలియడంతోనే అతడికి కొంత హుషారొచ్చింది. ఇంగ్లీషు సాహిత్యం చదివిన స్త్రీకి ఎంతలేదన్నా కొంత పాశ్చాత్య సంస్కృతి అలవాటు అయితీరుతుంది. వి...శా...ల... భా...వా...లు ఏర్పడతాయి. అందువల్లే కాబోలు ఆమె అంత సులభంగా, ఎంతో చనువుగా స్కూటర్ వెనక కూర్చుంది. తను మరి కాస్త ట్రై చేస్తే ఒడిలోనయినా కూర్చోదా?

అందులోనూ, తను 'మంచి వయసు'లో ఉంది. కోరికలు తీర్చే మొగుడు లేడు. కానీ కోరికలు సహజం. మరి ఆ కోరికలు తీర్చే మనిషి దొరికితే వదులుకుంటుందా?

వర్షం మొదలవక ముందే ఆమెను ఇంటికి చేర్చాడు గోపాలకృష్ణ.



★ ★ ★

గోపాలకృష్ణ కాలేజీకి బయల ్దేరబోతుంటే, హాట్‌ప్యాక్‌లో ఏదో పట్టుకొచ్చింది విమలకుమారి. ''తీసుకోండి'' అంది నవ్వుతూ.

''ఏమిటండీ అది?''

''దోసెలు''

అతడు ఇబ్బందిగా నవ్వాడు. ''ఎందుకండీ ఇప్పుడు''.

''ఫర్వాలేదులేండి''

అతడు హాట్‌ప్యాక్ అందుకుంటుంటే, ఆమె చేతివేళ్లు తనకు తగిలాయి. నరాలు జివ్వుమన్నాయి. ఆ షాక్ నుండి తేరుకోవడానికి కొద్దిసెకన్లు అవసరపడ్డాయి.

''కూర్చోండి''

ఆమె ఆ ఇంట్లోకి రావడం అదే మొదటిసారి. అటునిటు చూస్తూ కుర్చీలో కూర్చుంది.

'నిన్న సాయంత్రం స్కూటర్‌లో తీసుకురావడం, ఆమెను బాగా ఇంప్రెస్ చేసినట్టుంది. అందుకే తెల్లారేసరికి ఇంట్లో ఉంది. మరి ఒడిలోకి ఎప్పుడు చేరుతుందో ఏమో?...''

''మీరు మేరీడ్...''

''పెళ్ళయిందండీ.కానీ ఏం చేయను? మా ఆవిడకు పుట్టింటిని వదలాలనిపించదు. 'ఇదిగో పదిరోజుల్లో వచ్చేస్తానని పుట్టింటికి వెళుతుంది. అక్కడికవెళ్లాక ఇక్కడికి రాను బుద్దేయదు. దాంతో మానాన్నకు ఆరోగ్యం బాగోలేదు. అమ్మకు ఆరోగ్యం బాగోలేదు--కాస్త తగ్గాక బయల్దేరుతానంటూ' నెలల తరబడి గడిపేస్తుంటుంది.''

''అయితే మీ గురించి ఆమెకు నిశ్చింత కాబోలు'' ఆమె నవ్వింది.

''అంటే?'' వెంటనే అడిగాడు తను.

ఆమె తడబడి ''అదే ...భోజనాన్ని, స్వంతపనులను ఎలాగోలా చేసేసుకోగలరని...''ఏదో చెప్పేసింది. కానీ ఆమె చెప్పదలుచుకున్నది అది కాదని అతడి అభిప్రాయం.

అందుకే అతడు నవ్వుతూ అన్నాడు. ''కొన్ని పనులు, మీరన్నట్టు ఎలాగోలా చేసుకోగలను. మరికొన్ని పనులు చేయాలంటే ఇద్దరుండాలండీ..అదే ఇబ్బందయిపోతుందిప్పుడు..''

అర్థం చేసుకోలేనంత అమాయికురాలుకాదామె. ఆ విషయం తనకూ తెలుసు. ''వస్తానండీ'' ఆమె హడావిడిగా వెళ్ళిపోయింది.

'పిట్టదారిలోకి వస్తున్నట్టనిపించింది' గోపాలకృష్ణకు.

★ ★ ★

రెండు మూడు రోజులలలోనే ఆమెతో మరికాస్త చనువు ఏర్పడింది గోపాలకృష్ణకు.

ఆ సాయంత్రం-వారింటి డాబా మీద ఆమె కూర్చుని పుస్తకం చదువుకోవడం గమనించాక, అతడికి ఇంట్లో కాలు నిలవలేదు. అతడు మెల్లగా డాబా మీదకి చేరాడు.

''రండి!కూర్చోండి'' అతడిని చూసి కుర్చీలో నుండి లేస్తూ ఆహ్వానించిందామె.

''ఫర్వాలేదు. మీరు కూర్చోండి. నేనిలా కూర్చుంటాను.'' అతడు ఆమె దగ్గరగా నడిచి పిట్టగోడ మీద కూర్చున్నాడు.

ఆమె తన చేతిలో ఉన్న ఇంగ్లీషు నవల మూసేసింది. ''చెప్పండి'' అంది.

''ఏం చెప్పను?''

''ఏవయినా విశేషాలు?'' ఆమె మంచి హుషారయిన మూడ్‌లో ఉన్నట్టనిపించింది. తన టాపిక్‌ని 'అటువైపు' తీసుకెళ్ళడానికి ఇదే మంచిసమయమేమో అనుకున్నాడు అతడు.

అందుకే అన్నాడు. ''ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో నేనో మాట చెప్పనా?''

''చెప్పండి.''

''మిమ్మల్ని తొలిసారి చూడగానే నాకేమనిపించిందో తెలుసాండీ?''

''ఏమనిపించింది.''

''పీన పయోధర.''

ఆమె ముఖంలో చిరునవ్వు తొలగిపోలేదు. ''అంటే'' ప్రశ్నించింది.


''బాగా మనసున్న మనిషి అని అర్థం'' అతడు ఆ క్షణం అనుకున్నదొక్కటే, ఈ ఇంగ్లీషు లెక్చరర్‌కి తెలుగు కావ్యాలతో పరిచయం ఏముంటుందిలే అని. ఆ ఉద్దేశ్యం తోనే అతడు చిరునవ్వుతో ఆమె ముఖంలోకి చూడసాగాడు.

అప్పుడు..అప్పుడు అందామె ''బహుశా ఇది రాధికాస్వాంతనములోది అనుకుంటాను. 'పీన పయోధర మర్దన చంచల కరయుగ శావే' అంటే పీన అనగా బలసిన పయోధరరాలనగా ఎదపొంగులు, మర్దన...''ఆమె చెప్పలేక ఆగింది.

అప్పటికే అతడి గుండె కూడా ఆగిపోయింది. పిట్టగోడ మీద నుండి వెనక్కు విరుచుకుపడిపోతే బాగుణ్ణనిపించింది. చివరికి నవ్వలేక నవ్వుతూ ఆమె ముఖంలోకి చూసాడు. ఆమె ఇంకా నవ్వుతూనే ఉంది.

కొద్దిక్షణాల తర్వాత ఆమె మాట్లాడింది.

''ఇంగ్లీషు సాహిత్యంలో సెక్స్‌పాలు ఎక్కువని భ్రమపడుతుంటారుగానీ, అసలు తెలుగు కావ్యాలలోనే శృంగారం ఎక్కువేమోననిపిస్తుంటుంది నాకు. శ్రీనాధుని శృంగారనైషధంగానీ, పెద్దన మనుచరిత్ర గానీ, రామరాజభూషణుని వసుచరిత్ర అయితేనేమీ, ముక్కుతిమ్మన పారిజాతాపహరణం, వెంకటకవి విజయవిలాసం-ప్రతి కావ్యంలోనూ శృంగారం ఎంత చక్కగా లిఖింపబడిందో కదా? అన్నింటికన్నా ముఖ్యంగా-మనుచరిత్రలో గంధర్వుడు ప్రవరుని రూపం దాల్చి వరూధిని భోగించే సన్నివేశాలు ఎంతో అద్భుతంగా వ్రాయబడినాయో..హేట్సాఫ్ టు పెద్దనామాత్యా అని అనాలనిపిస్తుంది...''



ఆమెకు ఇంగ్లీషు సాహిత్యంలోనే కాదు, తెలుగు సాహిత్యంతోనూ చక్కని అనుబంధం ఉందని ఆమె మాటల్లోనే తెలిసిపోతుంది. తాను ఆమె తెలుగు భాషాజ్ఞానశూన్య అని తలచి, అతితెలివిగా 'పీనపయోధర' పదాన్ని అర్థం మార్చి చెప్పడం ఎంత తెలివితక్కువతనమో ఇప్పుడర్థమవుతోంది. కాని ఆమె తన తప్పుని గుర్తించీ, గుర్తించనట్టు ప్రవర్తించటం కొంతలో కొంత సంతోషం. అన్నింటికంటే అదృష్టమేమిటంటే-ఏమయితేనేం టాపిక్ 'శృంగారం' మీదకు మళ్ళింది ఆ టాపిక్ ఇచ్చిన ధైర్యంతో అతడు వెంటనే అనేసాడు.

''కావ్యాలకైనా, స్త్రీపురుషులకైనా శృంగారానుభవం పరిపూర్ణతను అందిస్తుంది.''

అప్పటివరకూ చిరునవ్వు నవ్వుతున్న ఆమె తొలిసారిగా నవ్వు ఆపేసింది. చురుగ్గా అతడి కేసి చూసింది.

ఇంతదూరం వచ్చాక ఇక వెనుకడుగు వేయాలనిపించలేదు గోపాలకృష్ణకు. శృంగార పురుషులను మదిలో తలచుకుని, ధైర్యం కొని తెచ్చుకున్నాడు. ''నిజం చెపుతున్నాను మేడమ్!, మీరంటే నాకు చాలా ఇష్టం. మిమ్మల్ని తొలిసారి చూడగానే అనుకున్నాను-ఏకాంతసేవలో మీ పీనపయోధరాలను నా కరములతో మర్దిస్తూ, రసామృతధారాపూరితా లేపదవి చుంబన ప్రక్రియలో మునిగితేలుతూ, మృగమద సౌరభ విభవ ద్విగుణిత ఘన సారసాంద్రవేటీ గంధ వ్రగితేతర పరిమళ భరిత సౌందర్యాన్ని అనుభవించాలని నామది....''

అతడు మాటలు పూర్తి చేయకముందే ఆమె చప్పున కుర్చీలో నుండి పైకి లేచింది. వడివడిగా మెట్ల వైపు నడుస్తోంది. ఆలస్యమయితే ఆ అవకాశం మరోసారి రాకపోవచ్చు. వచ్చినా, ఇంతధైర్యం చేయలేకపోవచ్చు. అందుకే అతడు చప్పున ఆమె నడుము చుట్టూ చేతులు వేసాడు. ఆక్షణం తనకు కలిగిన ధైర్యానికి తనకే ఆశ్చర్యమేసింది. అతడి చేతులు మాత్రం నడుము చుట్టూనే నిలిచిపోలేదు. పైట చెఱగు తప్పించి విశాల ఉదరభాగాన్ని, పైపైకి సాగి కుచోన్నతాలను మర్దన చేస్తున్నాయి...

అరనిమిషం తర్వాత ఆమె అతడి వైపు తిరిగింది. ఆమె ముఖంలో ఆవేశం లేదు. చిరునవ్వు ఉంది. అతడు ఆమె నవ్వు చూసి ఆశ్చర్యానందాలతో ఉక్కిరి బిక్కిరి అవుతుండగా ఆమె చెప్పింది.

''మీరిప్పుడు ఆవేశపడి లాభం లేదు. మరో మూడు రోజులు ఆగాల్సిందే''

అతడికి అర్థమయింది.

ఆమెను వదిలేసాడు-చాలా సంతోషంతోనూ, మరికాస్త అసంతృప్తితోనూ!

★ ★ ★

క్షణం ఒక యుగంలా గడవటమంటే ఏమిటో గోపాలకృష్ణకు అనుభవం లోనికి వచ్చింది.

మూడు రోజులు! అందులో ఓ పగలు తీసేసినా-సుమారు అరవై గంటలు..మూడువేల ఆరువందల నిముషాలు, రెండు లక్షలా పదహారు వేల క్షణాలు.

ఇన్ని క్షణాలు గడపటం ఎలా? అన్ని వేల క్షణాల తర్వాతనే కదా విమల కుమారి తన కౌగిలిలో బందీ అయ్యేది. ఆమె శరీరంలోని అణువణువూ తను స్పృజించగలిగేది...

ఊహల వత్తిడితో అతడికి మొదటిరాత్రి నిద్రపట్టలేదు.

రెండో రాత్రి అతికష్టం మీద నిద్రపోయాడు.

మూడోరాత్రి ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూడసాగాడు. తెల్లారింది.

అతడు చాలా హుషారుగా స్నానం పూర్తిచేసాడు, వేళాపాళాలేని ఆటకు ప్రాతఃకాలమయినా పర్వాలేదు. ఈసరికి విమలకుమారి కూడా స్నానం చేసేసి ఉండొచ్చు.

ఫ్రెష్‌గా తయారయి, ఎన్నో ఆశలతో ఆతృతగా విమలకుమారి గదిలోకి వెల్దామనుకుంటుండగా, తనింటి తలుపు చప్పుడయింది. ఎవరో అనుకుని తలుపు తెరిస్తే-ఎదురుగా, అరుణ!

భార్యను చూడడంతోనే నూటపది డిగ్రీల టెంపరేచర్, తొంభై ఎనిమిదికి పడిపోయింది.

ఆమె మాత్రం అతడినోసారి కింద నుండి పైదాకా చూసి ''ఏమిటింత ఉదయాన్నే నవమన్మధుడిలా తయారయ్యారు?'' ప్రశ్నించింది.

అసలాక్షణం ఆమెను ఊహించనే లేదు. పైపెచ్చు ఆమె చూపులు తనను అదోలా, నఖశిఖ పర్యంతం పరీక్షిస్తున్నట్టునిపించి 'సమ్‌థింగ్ రాంగ్' అనుకున్నాడు. పైకి మాత్రం ''ఏమీలేదు'' అన్నాడు.

''ఈ ఇంట్లోకి ఎప్పుడు మారారు?''

''పది రోజులయింది.''

'' ఈ ఇంట్లో రెండోపోర్షన్‌లో ఓ పెళ్ళికాని లెక్చరర్ ఉంటుందా?''

''ఉంటుం..ది'' అతడి కనుబొమలు ముడిపడ్డాయి. ''ఏం?''

''ఏమీలేదు. ఈ ఇల్లు వీలయినంత త్వరగా ఖాళీ చేద్దామని''

తల మీద పిడుగుపడినట్లు ఫీలయి ''ఎందుకని?'' అడిగాడు అతడు. ఆమె చేతిలో రెడీగా ఉంచుకున్న కవరు అతడికి అందించింది.

గోపాలకృష్ణ కవరులోని పేపర్ తీసి చూసాడు. అందులో రెండే వాక్యాలున్నాయి.

' మీవారు పక్కింటి పెళ్ళికాని, లెక్చరమ్మతో కులుకుతున్నాడు. మీ కాపురం కూలిపోకముందే ఇక్కడికి చేరుకోండి''

అతడు కవరుపైన చూసాడు. ఎవరో స్పీడ్‌పోస్ట్‌లో మేటర్ పంపారు.

''అర్థమయిందా? ఎవరో నా మేలు కోరి వ్రాసారు. బుద్ధిగా ఇల్లుమారుదాం సరేనా?''

రెండురోజుల్లోనే ఇల్లు మారక తప్పలేదు.

★ ★ ★

ఇల్లు మారినా విమలకుమారిని వదలాలనిపించలేదు. ఇల్లు మారిన మొదటి రోజు సాయంత్రమే గోపాలకృష్ణ ఆమెకోసం బస్టాప్‌లో కాపుకాసాడు.

విమలకుమారి వచ్చాక స్కూటర్ ఆమె దగ్గరగా పోనించి ''త్వరగా స్కూటరెక్కు, మీ ఇంటికెళ్దాం'' అన్నాడు.

''ఎందుకు?''

''ఇంకెందుకు? అందుకే! మా ఆవిడ ఇల్లు మార్చగలదేగానీ, మనం కలుసుకోకుండా చేయలేదు.''

''మీ ఆవిడ ఇల్లు మార్చడానికి కారణం?''

అతడు కొద్దిగా తడబడి ''ఆ...ఏముంది, ఎవరో మనిద్దరి మధ్యా సంబంధం ఉందని తనకు ఉత్తరం వ్రాసారు. అది ఎవరు వ్రాసారో అర్థం కావడం లేదు. మనమంటే పడని వ్యక్తులు ఎవ్వరూ లేరు కదా?'' అన్నాడు.

''మీవారు పక్కింటి పెళ్ళికాని లెక్చరమ్మతో కులుకుతున్నారు. మీ కాపురం కూలిపోకముందే ఇక్కడికి చేరుకోండి..ఇంతేకదూ ఉత్తరంలో ఉండేది''

అడుగుదూరంలో బాంబుపడ్డట్టు అదిరిపడ్డాడు గోపాలకృష్ణ '' ఆ వాక్యాలు యధాతథంగా నీకెలా తెలుసు? మా ఆవిడ చూపించిందా?''

విమలకుమారి జవాబు చెప్పలేదు. తన చేతిలోని నోట్సులో పెన్‌తో అవే వాక్యాలు వ్రాసింది-యధాతథంగా!

'దస్తూరి గుర్తుపట్టాడు గోపాలకృష్ణ. అతడికి చాలా ఆశ్చర్యమేసింది. ''ఇలా---ఇలా ఎందుకు చేసావ్?''

''ఏకాంతసేవ కోసం మీరు మీ 'కాంత' సేవ లేక ఏదో 'కాంత'లే అని సరిపెట్టుకుని పర'కాంత' కోసం ప్రయత్నిస్తుంటే నాకు మీమీద జాలేసింది. ఒక మగాడికి 'ఏకాంతం' కోసం 'ఏ'కాంత మాత్రమే ఉండాలి. 'ఏ' అంటే తెలుసుగా-ఇంగ్లీషులో 'ఒక' అని అర్థం. అంటే 'ఏకాంతం' 'ఏ' కాంతకే పరిమితం. ఇతరుల కోసం ప్రాకులాడితే సంసారాలు కూలిపోతాయి. నాకు పెళ్ళి కాకపోవచ్చు. కాని కాపురాలు కూల్చే ఆలోచన మాత్రం లేదు..''

ఆమె బస్సు కోసం ఆగలేదు. అటుగా వస్తున్న ఆటోను ఆపి. అందులో ఎక్కేసింది.

అతడు మాత్రం చాలాసేపు అక్కడే నిలబడిపోయాడు. చాలాసేపటి తర్వాత తేరుకున్నాడు. ఆమెకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకోవడానికి మాత్రం కొన్నాళ్ళు పట్టింది. అది వేరే సంగతి!

★